

రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

టీయూలో సమస్యలను పరిష్కరించాలి

డిచ్‌పల్లి: టీయూలోని నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలి తెలంగాణ యూనివర్సిటీ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంట్రిబ్యూటరి పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది అధ్యక్షుడు బి.సాయాగౌడ్, ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీసీ నియామకానికి మోక్షమెప్పుడో?



- తెలంగాణ విశ్వవిద్యాలయానికి సంవత్సరమైనా రెగ్యులర్ వీసీ లేరు
- ఇన్‌చార్జి ఆధ్వర్యంలోనే కొనసాగుతున్న యూనివర్సిటీ పాలన
- మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- విశ్వవిద్యాలయం విద్యార్థుల సమస్యలపై పట్టింపు కరువు



నిజామాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ విశ్వవిద్యాలయానికి సంవత్సరం గడిచినా రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ నియామకానికి మోక్షం లేదు. ఇన్‌చార్జిల పాలనలో విద్యాలయం కొనసాగుతుండటం వల్ల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. వసతి గృహాల నుంచి తరగతుల వరకు విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొన్ని కోర్సుల్లో తరగతుల నిర్వహణ సక్రమంగా జరగకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. పోటీ పరీక్షలతో పాటు ఇతర పరీక్షల్లో వెనకబడిపోతున్నారు. ఎన్నో ఆశయాలతో ఉన్నత విద్యకోసం విశ్వవిద్యాలయాల్లో చేరుతున్నా విద్యార్థులు చివరకు డిగ్రీలతోనే సరిపెట్టుకునే పరిస్థితి ఎదురవుతోంది. విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు సరైన విధంగా పోస్టుల భర్తీ చేయకపోవడం, భవన నిర్మాణాలు జరగకపోవడం విద్యార్థులకు కావాల్సిన పరికరాలను పూర్తిస్థాయిలో ల్యాబ్‌లో అందుబాటులో ఉంచకపోవడం వల్ల పీజీ తర్వాత పరిశోధనల వైపు వెళ్లాలనుకునే విద్యార్థులకు సమస్యలు ఎదురవుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లోనూ కొన్ని డిపార్ట్‌మెంట్‌లు మినహా ఇతర డిపార్ట్‌మెంట్‌ల పరిధిలోని విద్యార్థులు వెనకబడి పోతున్నారు. పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్ నియామకంతో పాటు అన్ని పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థుల నుంచి ఎన్నో ఏళ్లుగా డిమాండ్ కొనసాగుతున్నా పట్టించుకునే వారు లేరు. గత ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయాలను పట్టించుకోకపోవడం వల్ల గ్రేడింగ్‌లో వెనకబడగా ప్రస్తుతం కూడా వీసీల నియామకం చేపట్టకపోవడం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారు.

పలు దఫాలు ఇన్‌చార్జి వీసీలే..

విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటి నుంచి పలు దఫాలు ఇన్‌చార్జి వీసీలే కొనసాగుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసినప్పుడు వీసీని నియమించిన తర్వాత సమయంలో పట్టించుకోలేదు. పలు దఫాలు ఐఏఎస్ అధికారులనే ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నారు. వారు వివిధ శాఖలకు కార్యదర్శులుగా, ముఖ్య కార్యదర్శులుగా ఉండటం వల్ల విశ్వవిద్యాలయంలో సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదు. విశ్వవిద్యాలయం పరిధిలో వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం క్యాంపస్ పరిధిలో 1800 వరకు విద్యార్థులు ఉన్నారు. వీరిలో సగం మందికి వసతి ఇబ్బందిగా మారింది. బాలురతో పాటు బాలికలకు సమస్యలు ఎదురవుతున్నాయి. ఒక్కొక్క రూమ్‌లో పది మంది వరకు విద్యార్థులు ఉండే పరిస్థితి ఉంది. విశ్వవిద్యాలయం పరిధిలో బాలికల కోసం మరో రెండు హాస్టల్స్‌ను నిర్మించాలని గత కొన్నేళ్లుగా విద్యార్థులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారు లేరు. బాయ్స్ హాస్టల్స్‌లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది.

పోటీ పరీక్షల్లో రాణించని విద్యార్థులు..

రాష్ట్రంలో ఇతర విశ్వవిద్యాలయాల విద్యార్థులకు దీటుగా రాష్ట్ర, జాతీయ పరీక్షల్లో టీయూ విద్యార్థులు రాణించడం లేదు. జేఆర్ఎస్, సీఎస్ఐఆర్ వంటి పరీక్షలకు ఇప్పటి వరకు చాలా తక్కువ మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అవి కూడా విశ్వవిద్యాలయం పరిధిలోని ఫార్మస్యూటికల్ కెమిస్ట్రి, ఆర్గానిక్ కెమిస్ట్రి నుంచి మాత్రమే ఎంపిక అవుతున్నారు. సోషల్ సైన్సెస్, లింగిస్టిక్స్ నుంచి అనుకున్న విధంగా పోటీ పడటం లేదు. టీయూలో పూర్తిస్థాయి సిబ్బంది ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినప్పుడు మొత్తం 144 టీచింగ్ పోస్టులకు అనుమతి ఇచ్చారు. వీటిలో ప్రొఫెసర్ 19 పోస్టులు అనుమతి ఇవ్వగా 16 పోస్టులను మాత్రమే భర్తీ చేశారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు 40కి అనుమతి ఇవ్వగా 13 మాత్రమే భర్తీ చేశారు. 27 ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 85కు అనుమతి ఇవ్వగా 33 పోస్టులను మాత్రమే భర్తీ చేశారు. మిగతా 52 ఖాళీగా ఉన్నాయి. విశ్వవిద్యాలయం పరిధిలో టీచింగ్ పోస్టులు 62 మాత్రమే భర్తీ కాగా 82 ఖాళీగా ఉంచారు. వీరి స్థానంలో పార్ట్‌టైమ్‌లను నియమించి తరగతులను కొనసాగిస్తున్నారు.

అందుబాటులో లేని పరికరాలు

విశ్వవిద్యాలయం పరిధిలో ఆయా కోర్సులకు తరగతి గదులు ఉన్నా అనుకున్న విధంగా కొన్ని కోర్సులకు కావాల్సిన పరికరాలు అందుబాటులో లేవు. స్పోర్ట్స్ ఇతర ఎక్స్‌ట్రా కరికులర్ ఆక్టివిటిస్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ప్రభుత్వాలు ఉన్నత విద్యను పట్టించుకోకపోవడంతో పాటు తగినన్ని నిధులు కేటాయించకపోవడం వల్ల ఈ విశ్వవిద్యాలయం పరిధి లో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలు దఫాలు ధర్నాలు, ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం మాత్రం లేదు.

టీయూలో కొరవడిన పర్యవేక్షణ

ఏడాదిగా సమస్యలను పరిష్కరించే వీసీ లేకపోవడం వల్ల ఆయా కోర్సుల్లో తరగతుల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. టీచింగ్ స్టాఫ్ నుంచి నాన్ టీచింగ్ స్టాఫ్ వరకు పర్యవేక్షించే వారు లేకపోవడం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు తమ సమస్యలను విన్నవించేందుకు రిజిస్ట్రార్ అందుబాటులో ఉన్నా పూర్తిస్థాయిలో సమస్యం ఇస్తున్న అందరూ లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. అకాడమిక్ తరగతుల నిర్వహణ చేయాల్సిన ఫుల్ టైమ్ అధ్యాపకులు కొంత మంది ఇతర ప్రాంతాల నుంచి రోజూ వచ్చి వెళ్లడం పలు సమస్యలపై విద్యార్థులను రెచ్చగొట్టడం వల్ల కొన్ని సమయాల్లో తరగతుల నిర్వహణకు సమస్యలు ఎదురవుతున్నాయి. పూర్తిస్థాయిలో తరగతులు తీసుకోవాల్సిన కొంత మంది అధ్యాపకులు వివిధ బాధ్యతల పేరు మీద రోజుల తరబడి తరగతులను నిర్వహించడం లేదు. దీనివల్ల విద్యార్థులు కేవలం పరీక్షలు రాసి డిగ్రీ పొందుతున్నారే తప్ప వేరే పరీక్షల్లో పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధించడం లేదు. గతంలో పనిచేసిన టీయూ వీసీ అవినీతి కేసులో ఏసీబీ ట్రాప్‌పై జైలుకు వెళ్లగా అప్పటి నుంచి ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించారు. ప్రస్తుతం ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత మేనెలలో వీసీల పదవీకాలం ముగిసింది. వీసీల నియామకం కోసం చెర్చ్ కమిటీలను వేసినా ఇప్పటి వరకు నియామకం చేపట్టలేదు. ఆ కమిటీలో సమావేశమై వీసీల కోసం చేసిన దరఖాస్తులను పరిశీలించలేదు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, వివిధ శాఖల జిల్లా అధికారులు

'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం కావాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 29: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్లు, జడ్పీసీఈవోలు, డీపీవోలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముందుగా మూడు దశలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ, చివరకు మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై పకడ్బందీగా దృష్టికేంద్రీకరించాలని జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షించాలన్నారు. శాసన సభ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే పార్టీలకు అతీతంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు సున్నితత్వంతో కూడుకొని ఉంటాయని ఏమాత్రం అజాగ్రత్తకు తావివ్వకుండా ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు.

వచ్చేనెల 21న ఓటరు జాబితా విడుదల చేయాలి

సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి అభ్యంతరాలు స్వీకరించాలని, సెప్టెంబర్ 21న తుది ఓటరు జాబితా విడుదల చేయాలన్నారు. ఏ చిన్న పొరపాట్లకు తావులేకుండా ప్రతి దశలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దన్నారు. పంచాయతీరాజ్ చట్టం 2018తో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఉన్న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వారీగా రూపొందించుకోవాలని అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుంచి గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించాలన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 వరకు ఓటర్లు ఉండేలా చూడాలని 650 ఓటర్లు దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డులో ఓటు హక్కు ఉండకుండా చూడాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓటు ఒకేచోట ఉండేలా ఓటరు జాబితా నిశితంగా పరిశీలన చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సమాగ్రిని సమకూర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలీస్ సిబ్బందిని గుర్తించి వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయాలతో పాటు మండల స్థాయిలో ప్రత్యేక ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేసి ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ఈ విసిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, జడ్పీ సీఈవో ఉషా, డీపీవో తరుణ్‌కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

రహదారులు రక్తసిక్తం



- జిల్లాలో రక్తమోడుతున్న రహదారులు
- రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- నిబంధనలు పాటించని వాహనదారులు
- మద్యం మత్తు, అతివేగమే ప్రమాదాలకు కారణం
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోని వైనం



ఆర్మూర్‌లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఖిల్లా, ఆగస్టు 29: జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రయాణ సౌకర్యార్థం నిర్మించిన రహదారులు రక్తమోడుతున్నాయి. కన్నుమూసి కన్నుతెరిచే లోపే అంతా అయిపోతోంది. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, అతివేగం, మద్యం మత్తులో వాహనాలను నడపడంతో నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. పోలీసు శాఖ రోడ్డు ప్రమాదాలపై హెచ్చరికలు చేసినప్పటికీ వాహనదారుల్లో మార్పు రావడం లేదు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న యువత..

మార్కెట్‌లోకి కొత్త కొత్త రకాల వాహనాలు రావడంతో యువత ఆ వాహనాలపై ఆసక్తి చూపుతోంది. యువత ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని వాహనాల కంపెనీలు సైతం ఎక్కువ వేగంగా వెళ్లే వాహనాలతో పాటు స్పోర్ట్స్ వాహనాలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. అటువంటి వాహనాలను కొనుగోలు చేసిన వాహనదారుల్లో ముఖ్యంగా యువతే అధికంగా ఉంటుంది. అయితే వాహనాన్ని నిర్లక్ష్యంగా, అతివేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు ప్రమాద ఘటనల్లో కొందరు మృత్యువాత పడితే మరి కొందరు గాయాలపాలవుతున్నారు.

> **ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి..**
>
> : నారాయణ (ట్రాఫిక్ ఏసీపీ)
>
> వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి. నిబంధనలు పాటించకపోవడంతోనే చాల మంది రోడ్డు ప్రమాదాలబారిన పడి మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా యువత ద్విచక్ర వాహనాలను నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు కాపాడుకునేందుకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. జిల్లాలో పోలీసు రికార్డుల ఆధారంగా గతేడాది 337మంది రోడ్డు ప్రమాదాల బారిన పడ్డారు. ఈ ఏడాది ఇప్పటికే 218మంది రోడ్డు ప్రమాదాల బారిన పడ్డారు. వీరిలో ద్విచక్ర వాహనదారుల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. దీనికి కారణం వాహనదారులు నిబంధనలు పాటించకపోవడమే.

మద్యం మత్తులో వాహనాలను నడిపి..

జల్సాలకు అలవాటు పడిన యువత కొందరు మద్యానికి బానిసలవుతున్నారు. మద్యం మత్తులో వాహనాలను అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతున్నారు. మద్యంమత్తులో ఉండడం వల్ల ఇతర వాహనాలను గుర్తించకపోవడమేకాకుండా ఎక్కడ గుంతలు ఉన్నాయన్న విషయాన్ని కూడా గమనించకపోవడంతో రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. తాజాగా మంగళవారం తెల్లవారు జామున రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆగి ఉన్న లారీని గమనించకపోవడంతో వేగంగా వెళ్తున్న కారు వెనుక నుంచి లారీని ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయాలపాలయి చికిత్స పొందుతున్నాడు. రోడ్డు ప్రమాదానికి కారణం అతివేగంగా కారు నడుపడమే నని పోలీసులు భావిస్తున్నారు. అదే విధంగా జిల్లాలో మొత్తం వాహనాల సంఖ్య 447923కాగా, అందులో ద్విచక్ర వాహనాల సంఖ్య370789 ఉన్నాయని తెలిపారు. అత్యధిక మంది వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడుపడం వల్లనే ప్రమాదాల బారిన పడుతున్నారని పోలీసులు భావిస్తున్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం బారి నుంచి తమనుతాము కాపాడుకోవచ్చని పోలీసు శాఖ వాహనదారులకు సూచిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

- జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

బోధన్ రూరల్, ఆగస్టు 29: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మున్సిపల్ కాంప్లెక్స్ భవనంలో తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ జిల్లా న్యాయసేవ సమితి ఆదేశాల మేరకు బోధన్‌లో మండల న్యాయసేవ సమితి ఆధ్వర్యంలో కమ్యూనిటీ మిడియేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాలను అతిక్రమిస్తే జరిమానాలు, శిక్షలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోశెట్టి, పద్మాసింగ్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అలీసాగర్ ఆయకట్టుకు నీటి విడుదల

నవీపేట, ఆగస్టు 29: మండలంలోని కోస్లీలోని అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా శుక్రవారం ఆయకట్టుకు సాగునీటిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విడుదల చేయనున్నారని ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రెడ్డి తెలిపారు. 2024-25 వానాకాలం సీజన్‌కు సంబంధించి మధ్యాహ్నం 3గంటలకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్విచ్ ఆన్ చేసి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. దీని ద్వారా నవీపేట, రెంజల్, ఎడపల్లి, నిజామాబాద్, డిచ్‌పల్లి, మాక్లూర్ మండలాలకు చెందిన సుమారు 53,793ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందని ఆయన పేర్కొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ ద్వారా కొత్త కోర్సులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 29: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ సోషల్ సైన్సెస్‌లో వివిధ సర్టిఫికెట్, అండర్ గ్రాడ్యుయేట్, డిప్లొమా మరియు పోస్టుగ్రాడ్యుయేట్ ప్రోగ్రాంల కోసం 2024-25 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆనంద్ పవార్, అసోసియేట్ ప్రొఫెసర్ రాధాకృష్ణలు తెలిపారు. గురువారం నగరంలోని గిరిరాజ్ కళాశాలలో ఉన్న అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. న్యాక్ ఏగ్రేడ్ గుర్తింపు పొందిన యూనివర్సిటీ ద్వారా విద్యలో నాణ్యమైన ఉన్నత ప్రమాణాలను నిర్వహించడంతో పాటు అర్హత కలిగిన అధ్యాపకులు, మౌలిక సదుపాయాల ద్వారా రెగ్యులర్ యూనివర్సిటీలతో సమానంగా అనేక కోర్సులను అందిస్తున్నామన్నారు. ఆర్థిక పరిమితులు, కట్టుబాట్లు, వివిధ కారణాల వల్ల రెగ్యులర్ కాలేజీలకు హాజరుకాలేని విద్యార్థులకు తమ యూనివర్సిటీ ద్వారా ప్రత్యేకమైన అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఉన్న విద్యను అందిస్తున్నామన్నారు. స్కిల్ కోర్సులు, మల్టీ మీడియా లెర్నింగ్ నేటి పోటీ ప్రపంచంలో విస్తృత వ్యాప్తి ఉన్నందున వాటిని సైతం అందిస్తున్నామని అన్నారు. యూనివర్సిటీ ద్వారా ప్రతి ఒక్కరికి విద్యను అందించేందుకు వివిధ జిల్లాల్లో అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అవకాశాన్ని జిల్లాకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా అందిస్తున్న కోర్సులలో చేరాలన్నారు. ఈ సమావేశంలో గిరిరాజ్ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ రంజిత పాల్గొన్నారు.

30 శాతం ఫిట్‌మెంట్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

పెద్దబజార్, ఆగస్టు 29: పీఆర్‌సీ కమిటీని వెంటనే రిపోర్ట్ విడుదల చేసేలా 30 శాతం ఫిట్‌మెంట్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం పెన్షనర్స్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇప్పటి వరకు నాలుగు డీఏలు రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని వీరి మూలంగా రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు భోజారావు, కార్యదర్శి మధన్‌మోహన్, కోశాధికారి నారాయణ, వీరయ్య, నాయకులు వెంకట్రావ్, సిర్పహన్మాండ్లు, దీన సుజన, ప్రసాద్‌రావు, రాధా కృష్ణా, సిర్పలింగం పాల్గొన్నారు.

రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

పెద్దబజార్, ఆగస్టు 29: రైతులందరికీ రెండు లక్షల రుణాలను వెంటనే మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్‌డీవో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆగస్టు 15వరకు రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి 31వేల కోట్ల రూపాయలకు గాను 18వేల కోట్ల రూపాయలు మాత్రమే నిధులు విడుదల చేయడంతో అనేక మంది రైతులకు రుణమాఫీ కాక కార్యాలయం చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతూ తీవ్రమైన మానసిక వేదనతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. చిన్న చిన్న కారణాలు చూపుతూ ప్రభుత్వం నిబంధనలను సడలించకపోవడంతో రుణమాఫీ వర్తించడం లేదని తిరిగి దరఖాస్తులు తీసుకొని ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పడం జరుగుతుందని రైతులు మనోవేదనను అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. రుణాలు తీసుకున్న రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణాలను మాఫీ చేయడానికి కావాల్సిన నిధులను విడుదల చేసి నిబంధనలను సడలించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులందరికీ పంట పండించే వారికి ఎకరానికి 15వేల రూపాయలు రైతుభరోసాను ఇస్తామని హామీ ఇచ్చి రెండు పంటలు గడిచినప్పటికీ రైతుభరోసా ఇవ్వలేదని వెంటనే రైతులందరికీ ఎకరానికి 15వేల రూపాయలు రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ సమక్షంలో రైతుల పంటలకు అదనంగా క్వింటాలుకు 500 రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చి గత రెండు సీజన్‌లో అమలు జరగలేదన్నారు. ఇప్పుడు కేవలం సన్న వరి ధాన్యానికి మాత్రమే చెల్లిస్తామని తెలియజేస్తున్నామని చెప్పడం దీనిమూలంగా రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయడంతో పాటు రైతుభరోసాను, పంటలకు బోనస్ ధరను అమలు జరపాలని ఆయన అన్నారు. లేని యెడల ప్రభుత్వానికి రైతాంగం తమ పోరాటాల ద్వారా గుణపాఠం చెప్పే పరిస్థితి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుజాత, కటారి రాములు, నర్సయ్య, కృష్ణ, సతీష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్‌ల పంపిణీ

డిచ్‌పల్లి, ఆగస్టు 29: ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో స్పోర్ట్స్ డే సందర్భంగా జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్‌లను డిచ్‌పల్లి గల్ఫ్ చేయూత సంఘం సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సంవత్సరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు క్లాస్‌లో ఫస్ట్, సెకండ్ వచ్చిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీతయ్య, గల్ఫ్ చేయూత సంఘ సభ్యులు తులసిదాస్, అశోక్, మురళి, కృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

సిరికొండ, ఆగస్టు 29: గణేష్ ఉత్సవాలను ప్రజలు, యువజన సంఘాల వారు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై ఎల్.రామ్ విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం సిరికొండ పోలీసు స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో మండంలోని వివిధగ్రామాల్లో ఏర్పాటైన గణేష్ మండళ్ల సంఘాల సభ్యులు, అన్ని మతాల పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పదకొండు రోజుల పాటు వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో ప్రశాంతంగా, ఆనందోత్సవాల మధ్య ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్సై సూచించారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

బోధన్‌టౌన్, ఆగస్టు 29: ఆర్య వైశ్యుల కులస్థుల ఆరాధ్య కుల దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి అని అమ్మవారిని పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని గౌరవ అధ్యక్షులు కొత్త రాజేశ్వర్, అధ్యక్షులు గంజి వెంకటేశంలు అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణపతి హోమం, చండీ హోమం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి యొక్క విశిష్టతను వివరించారు. అమ్మవారిని పూజిస్తే సకల శుభాలతో పాటు అష్ట ఐశ్వరాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కంటాల రమేష్, కోశాధికారి పబ్బ మురళి, చిద్ర ప్రదీప్ గుప్తా, కొత్త రవీందర్, బిళ్ల కంటి అనిల్‌లతో వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ అమర వీరులకు నివాళి

ఎడపల్లి, ఆగస్టు 29: మండలంలోని పోచారం గ్రామంలో గురువారం సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో విద్యుత్ ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిలకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్, జిల్లా నాయకులు గుమ్ముల గంగాధర్, మల్లేష్, కాశం రవి, సంతోష్, హనుమంతు తదితరులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

రుద్రూరు, ఆగస్టు 29: సెప్టెంబరు 2 నుంచి చేపట్టే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం రుద్రూరు మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రుద్రూరు మండల ఇంచార్జి మోహన్‌రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గం కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ గ్రామాన తిరుగుతూ పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, సాయినాథ్, పార్వతి మురళీ, రాజారామ్, శానం బాలు, మండల నాయకులు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



ధర్పల్లిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

ధర్పల్లి, ఆగస్టు 29: మండల కేంద్రంలోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో వ్యవహారిక భాషోద్యమ పితామహుడు వెంకటరామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. తెలుగు భాషా విభాగాధిపతి ప్రభాకర్ మాట్లాడుతూ భాషా ఉద్యమ నేపథ్యాన్ని, రామ్మూర్తి కృషిని ఈ సందర్భంగా వివరించారు. ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ అందరూ తెలుగు భాషను చక్కగా నేర్చుకోవాలని తెలుగు భాషలోనే వ్యవహరించాలని తెలుగు భాష వారసత్వాన్ని తర్వాతి తరాలకు పదిలంగా అందించాలని పేర్కొన్నారు.ఈసమావేశంలో వక్తలు తెలుగు భాషా వైభవాన్ని చాటి చెప్పారు.ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీ రామ్, అధ్యాపకులు రవిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, రాంచందర్, వెంకటకిషన్, శారద, గంగాధర్, సంజీవ్, పద్మ, తబస్సుం, సరిత,నిహారిక, సంధ్యారాణి, సరళ, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సిరికొండ:తెలుగు భాషా,క్రీడల దినోత్సవం సందర్భంగా సిరికొండ మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌ల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఉపాధ్యాయులు,విద్యార్థులు నివాళి అర్పించారు. సిరికొండ మండల కేంద్రంలో ఆదర్శపాఠశాల, సత్యాశోధక్, ప్రతిభ పాఠశాలల్లో విద్యార్థులకు పరుగు పందెం, వ్యాసరచన,ఉపన్యాస, కవితల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ప్రిన్స్‌పల్, హెచ్ఎం బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో వైస్‌ప్రిన్స్‌పల్,హెచ్ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పద్యభాగంలో పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుబాషా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పరబాష మోజులో పడి తెలుగుబాష అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, తెలుగుబాష గొప్పతనాన్ని, తెలుగుబాష మహత్యం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం తెలుగుబాష ఉపాధ్యాయులను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రజీయోద్దిన్‌ఆస్లాం, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు29: ఆలూర్ మండల కేంద్రంలో మట్కా నిర్వహిస్తున్న అఖిల్‌ను బుధవారం రాత్రి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు మట్కా నిర్వహిస్తున్న స్థావరాన్ని తనిఖీలు చేయగా మట్కా చిట్టీలతో పాటు రూ.1300లను స్వాధీనం చేసుకొని అఖిల్‌ను అరెస్టు చేసి కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎత్తొండలో మూడు గేదెలు మాయం

కోటగిరి,ఆగస్టు29: కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో మూడు గేదెలు మాయమైనట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. గ్రామానికి చెందిన అగ్గు లింగయ్య అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో మూడు గేదెలను కట్టేసి ఉంచినట్లు ఎస్ఐ తెలిపారు. ఉదయం లేచి చూసే సరికి పాకలో మూడు గేదెలు కనపడలేదు. వాటి కోసం వెతికిన దొరకకపోవడంతో బాధితుడ లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



టీయూలో గోపీచంద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్



బహుమతులు అందజేస్తున్న దృశ్యం



నవీపేట మోడల్ పాఠశాలలో ...

సుభాష్‌నగర్, ఆగస్టు 29:విధి నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులకు జాతీయ క్రీడా దినోత్సవం రోజు క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషకరమని టిఎన్‌జివోల జిల్లా అధ్యక్షుడు ఉద్యోగ జెఏసి ఛైర్మన్ అలుక కిషన్ అన్నారు. నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పచ్చజెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, బాక్సింగ్ కోచ్ శంషొద్దీన్, టిఎన్‌జివోస్ కార్యదర్శి శేఖర్, సహ అధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, టిజివో అధ్యక్షుడు అమృత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మానసిక వికాసానికి విద్యతో పాటు క్రీడలు అత్యంత ప్రధానం అని టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అన్నారు. గురువారం భారతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ స్పోర్ట్స్‌డేను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సైనికుడిగా కొనసాగిన ధ్యాన్‌చంద్ అంతర్జాతీయంగా హాకీ క్రీడాకు గుర్తింపు తేవడం భారతదేశానికి గర్వకరాణం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి, స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, చీఫ్ వార్డెన్ మహేందర్ రెడ్డి, పిఆర్‌వో పున్నయ్య, నేత, నరేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల, మోకన్‌పల్లిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడ దినోత్సవం నిర్వహిస్తుంటారు. దీంట్లో భాగంగా మోడల్ పాఠశాలలో విద్యార్థులకు వివిధ క్రీడపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులకు సైతం రగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో సైతం విద్యార్థినులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, పీడీ, కస్తూర్బా బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రాణి, పీఈటీ, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ధర్పల్లి: నేటి యువత ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని లిటిల్ హార్ట్స్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోగల పాఠశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ సింగ్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.విద్యార్థులు, క్రీడాకారులు, యువకులు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని కరస్పాండెంట్ శ్రీకాంత్ పేర్కొన్నారు.

రెంజల్: మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని నేషనల్ క్రీడ దినోత్సవం సందర్భంగా రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు క్రీడ పోటీలు నిర్వహించారు. ఇట్టి పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, క్రీడ పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్:ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా గురువారం భీమ్‌గల్ పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో కరస్పాండెంట్ షఫీ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సన, ప్రధానోపాధ్యాయుడు రాధకృష్ణన్‌నాయర్,వ్యాయమ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో గురువారం క్రీడాకారులను పట్టుశాలువ, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, అంబల్ల తిరుపతి, ఫిజికల్ డైరెక్టర్ రిటైర్డు కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి,హాకీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.రాజేష్, ఉపాధ్యాయులు పీడీ రాజేష్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ తప్పనిసరి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు29: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ తప్పనిసరి అని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చేపూర్ క్షత్రీయ పాఠశాల క్రీడా మైదానంలో మండలస్థాయి అంతర్ పాఠశాలల రూరల్ క్రీడలను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసం, శారీర దారుఢ్యం పెరుగుతుందన్నారు. గెలుపు ఓటమిలు సమానంగా తీసుకొని ఓడిన ప్రతీసారి నిలబడి గెలవడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులే అధికంగా చదువుతారని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. విద్య, ఆరోగ్యంకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం తన ఉద్దేశమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు రాణించి ఉన్నత స్థానంలో నిలవాలన్నారు. విద్యార్థుల నైపుణ్యం దేశానికి ఉపయోగపడాలని,విద్యార్థులు చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల బాధ్య తతో వ్యవహరించాలని, తమ పిల్లల నడవడిని నిత్యం గమనించాల న్నారు. మండలస్థాయి క్రీడలకు 12పాఠశాలల నుంచి క్రీడాకారులు వివిధ క్రీడా అంశాల్లో పాల్గొంటున్నాయి. అంతకు ముందు జ్యోతిప్రజ్వాలన చేసి క్రీడలను ప్రారంభిం చి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, క్షత్రీయ విద్యా సంస్థల ఛైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, క్రీడల కన్వీనర్ చేతనకుమారి, కోకన్వీనర్ నర్సింహస్వామి, ఆర్గనైజ్ కార్యదర్శి గంగాధర్, కో ఆర్గనైజింగ్ కార్యదర్శి బ్రిజేష్, పీడీలు,పీఈటీలు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులు గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



వేల్పూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్

వేల్పూర్,ఆగస్టు29:వేల్పూర్ మండలంలో బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్ దిశ నిర్దేశం చేశారు. గురువారం వేల్పూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల స్థాయి కార్యవర్గ సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు ఏలేటి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మోహన్ మాట్లాడారు. సెప్టెంబర్‌లో జరిగబోయే పార్టీ సభ్యత్వ గురించి వివరిస్తూ సభ్యత్వ నమోదుకు విజయవంతం చేయడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. బీజేపీ ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేస్తూ లక్ష్యానికి మించి పార్టీ సభ్యత్వం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్య దర్శులు వలం రవి, లగిశెట్టి బానుచందర్, నర్సారెడ్డి, నగేష్, రమేష్‌రెడ్డి, లింగన్న, రాజ్‌కుమార్, రఘుపతి, నర్సాగౌడ్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

గ్రామాల్లో రుణమాఫీపై ఇంటింటి సర్వే

సిరికొండ ఆగస్టు 29 :రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణ మాఫీ పథకంలో రుణాలు మాఫీ కాని రైతుల ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నట్లు మండల నోడల్ వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు.రుణాలు మాఫి కాలేదని 940మంది రైతులు ధరఖాస్తులు చేసుకున్నారని ఆయన తెలిపారు.రేషన్‌కార్డు లేని రైతులు 730 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.గురువారం హుస్సేన్‌నగర్ గ్రామంలో రేషన్‌కార్డు లేకుండా రుణాలు మాఫీకాని రైతులను ఇంటింటికివెళ్లి విచారణ చేసినట్లు ఆయన తెలిపారు. ఇలా రోజుకో గ్రామానికి వెళ్లి విచారిస్తున్నట్లు నోడల్ అధికారి చెప్పారు.

వేల్పూర్:మండలం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం వేల్పూర్ మండలం మోతెలో రుణమాఫీపై మండల వ్యవ సా యాధికారిణి శృతి ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిం చారు. గ్రామంలో ఇప్పటి వరకు రుణమాఫీ కాని రైతులను గుర్తించి వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు విధులకు ఆటంకం.. ఇద్దరిపై కేసు నమోదు

వేల్పూర్, ఆగస్టు29: పెట్రోలింగ్ చేస్తున్న పెట్రోలింగ్ పార్టీ పోలీసుల చట్టపరమైన విధులకు అటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగనాథ్ తెలిపారు. బుధవారం రాత్రి సమయంలో పోలీసులు నిర్వహిస్తున్నపెట్రోలింగ్‌లో భాగంగావెంకటా పూర్ గ్రామానికి చేరుకునే సరికి ఆరేపల్లి అర్వింద్, గైన్మిది జనార్ధన్ యాదవ్ అలియాస్ ధనుంజయ్‌తో పాటు మరికొంత మంది అర్వింద్ డిజేషాప్ వద్ద గుమ్మిగుడి ఉన్నారు.పోలీసులు వారిని మందలిం చగా అర్వింద్, గైనిమీద జనార్ధన్‌యాదవ్‌లు పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు అటంకం కలిగించినట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జనార్ధన్ యాదవ్ జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించగా అర్వింద్ పరారీలో ఉన్నాడన్నారు.

వేంపల్లిలో యువకుడి అదృశ్యం

ముప్కాల్, ఆగస్టు29: మండలంలోని వేంపల్లికి చెందిన దండుగుల రమేష్ అదృశ్యమైనట్టు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. ఈనెల 27న ఆర్మూర్ వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళిన రమేష్ ఇప్పటికీ రాకపోవడంతో గురువారం రమేష్ భార్య సుమలత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత పూడ్చివేత



నవీపేటలో రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చివేస్తున్న సిబ్బంది

నవీపేట, ఆగస్టు 29 : నవీపేటలోని తడగామ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతను గురువారం ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చివేయించారు. గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేయాలని అనే కథనానికి అధికారులు స్పందించారు. నవీపేట నుంచి నందిపేటకు వెళ్లే రహదారిపై ఈ భారీ సైజు గుంత ఏర్పడడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు ఇటీవల ప్రమాదం బారిన పడ్డారు. ఈ విషయంపై స్పందించిన ఆర్ అండ్ బీ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రోడ్డుపై గుంతను కంకర, మొరంతో పూడ్చివేశారు.

క్రషర్‌ను తొలగించాలని సీఎంకు ఫిర్యాదు

బాన్సువాడ, ఆగస్టు 29 : మండలంలోని సోమేశ్వర్ గ్రామానికి అనుకొని ఉన్న స్టోన్ క్రషర్‌లను తక్షణమే తొలగించాలని గ్రామస్తులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్‌లకు పోస్టు ద్వారా గురువారం ఫిర్యాదు చేశారు. నివాసాలకు అనుకొని ఉన్న స్టోన్‌క్రషర్లు గత 30 సంవత్సరాల నుంచి నడుస్తున్నాయని, వీటి బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్ళు బీటలు వారుతున్నాయని పేర్కొన్నారు. బ్లాస్టింగ్‌ల శబ్దాలు, దుమ్ము, డాంబర్ దుర్వాసన, పొగ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అనారోగ్యాల బారిన పడుతున్నామని తెలిపారు. గతంలో అధికారులకు, నాయకులకు ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, ఇష్టానుసారంగా రాత్రుల్లో భారీ బ్లాస్టింగ్ చేస్తున్నారని, రాత్రిళ్ళు నిద్రలు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రైవేట్ క్లినిక్ మూసివేత



సీజ్‌చేస్తున్న అధికారులు

రామారెడ్డి, ఆగస్టు 29 : రామారెడ్డి మండల కేంద్రంలో ప్రైవేట్ క్లినిక్‌ను సీజ్‌చేసినట్లు మండల వైద్యాధికారి సురేష్ తెలిపారు. అర్హతలు లేకుండా ఇష్టారీతిన మందులు రాస్తున్నారని కేవలం ప్రాథమిక చికిత్స అందించాల్సి ఉండగా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, తనిఖీలలో బయటపడిందని దీంతో సదరు క్లినిక్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అన్నారం పీహెచ్‌సీ వైద్యురాలు మానసక్లినిక్‌ను పరిశీలించి ఇష్టారీతిన మందులు రాస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మన్, ఫార్మాసిస్ట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదు సెల్‌ఫోన్‌ల స్వాధీనం

బోధన్‌రూరల్, ఆగస్టు 29 : గుర్తు తెలియని దొంగలు అపహరించిన ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లను యజమానులకు అందజేస్తున్నామన్నారు. ఫిర్యాదుదారులు చంద్రశేఖర్, గఫూర్ మాలిక్, గోపి, మహ్మద్ హజరుద్దీన్, నవీన్‌లకు సంబంధించిన ఐదు ఫోన్‌లను సీఈఐఆర్‌ల ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న ఫోన్‌లను ఫిర్యాదుదారులకు అప్పజెప్పడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ విలువైన సెల్‌ఫోన్‌లను జాగ్రత్తగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ధర్నా



రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

ఆర్మూర్ రూరల్, ఆగస్టు 29 : రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆర్మూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆర్మూర్ డివిజన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని, రేషన్‌కార్డు నిబంధనను తొలగించి పట్టాపాస్ పుస్తకంపై రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న దానికి సంబంధం లేకుండా ప్రభుత్వం రూ.2లక్షల రైతు ఖాతాలో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములకు కూడా రైతు రుణమాఫీ, రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు రుణమాఫీ అయిన రైతులందరికి మళ్ళీ కొత్త రుణాలు మంజూరు చేయాలన్నారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి రైతు బంధు, రుణమాఫీ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తోగటి భూమన్న, ఓంకార్, కిషన్, నవీద్, గణేష్, అన్వర్‌ఖాన్, జయ, అజయ్, రఫీక్ పాల్గొన్నారు.

కామారెడ్డిరూరల్: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తు గురువారం కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని తెలంగాణ గ్రామీణబ్యాంక్ వద్దరోడ్డుపై కూర్చుని రైతులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరైతుకురుణమాఫీచేస్తామని చెప్పి ప్రభుత్వం ఈ రకంగా చేయడం సమంజసం కాదని తెలిపారు. ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించిందని ఇప్పుడు రేషన్‌కార్డు ప్రతిపాదకన రుణమాఫీచేస్తామనడం తగదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామని లేదంటే పెద్దఎత్తున నిరసన తెలుపుతామని అన్నా రు.రైతులు రోడ్డుపై కూర్చుని నిరసన తెలుపడంతో వ్యవసాయాధికారులు వచ్చి నచ్చచెప్పడంతో ధర్నావిరమించారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్,మోహన్, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పడిగాపులు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 29 : రుణమాఫీ కానీ రైతులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా గురువారం జక్రాన్‌పల్లిలోని మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులు రుణమాఫీ కోసం దరఖాస్తులు చేసుకోవడానికి తరలివచ్చారు. ఈ దరఖాస్తులు చేసుకోవడానికి రైతులు వ్యవసాయ కార్యాలయం ఎదుట రచ్చబండ వద్ద పడిగాపులు కాశారు. ఈ రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు రైతులు కార్యాలయానికి రాగా రేషన్‌కార్డుతో పాటు ఇతర పత్రాలు జతపర్చాలని అధికారులు తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రేషన్‌కార్డులు లేకుండా దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించినప్పటికీ అధికారులు రేషన్‌కార్డును జతపర్చాలని చెబుతున్నారని, దీంతో కొందరు రైతులకు రేషన్‌కార్డు లేని వారి పరిస్థితి ఏంటని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి రుణమాఫీ కానీ దరఖాస్తులను తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

'విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి'

బోధన్‌రూరల్, ఆగస్టు 29 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజరి గంగారాంలు అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ట్రస్ట్ అధినేత ఆయేషా ఫాతిమా జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులను, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయేషా ఫాతిమా తమ ట్రస్ట్ ద్వారా 1500మంది పిల్లలకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారని గుర్తు చేశారు. నిరుపేదల కోసం ఆమె చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుధారాణి, బీఆర్ఎస్ నాయకులు మొబిన్ ఖాన్, ఎన్ఆర్ఐ హైమద్, నాగుల శంకర్ శంకర్ గౌడ్, సాగర్, నసీర్, ప్రవీణ్ నాయక్, నరేష్ కుమార్, దేవ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని వినతి

రెంజల్,ఆగస్టు29: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయానికి అనుకుని ఉన్నట్టువంటి 340 సర్వే నెంబర్‌లో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని గతంలో హైకోర్టులో కేసు వేయడం జరిగిందని గత నెలలో హైకోర్టు అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని తీర్పు ఇవ్వడం జరిగిందని కోర్టు తీర్పును గౌరవిస్తూ అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతూ గురువారం తహసీల్దార్‌కు బీజేపీ మండల అధ్యక్షులు గోపికృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో 340సర్వే నెంబర్‌లో తహసీల్దార్ కార్యాలయానికి అనుకుని ఉన్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ఉన్నతాధికారులకు నివేదిక అందించిన కూడా చర్యలు చేపట్టకపోవడంతో హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని, 2017లో హైకోర్టులో ఫిర్యాదు చేయడంతో జులై నెలలో తీర్పు వెలువడిందని, తహసీల్దార్ కార్యాలయానికి అనుకుని ఉన్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని తీర్పు వెలువరించడం జరిగిందని, ఇట్టి కాపీని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. అక్రమ నిర్మాణం తొలగించాలని, లేనిపక్షంలో రాస్తారోకోలు చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల రాజు, మాజీ మండల అధ్యక్షులు చుక్క రాజు, పార్థ రమేష్, లోల ఒడ్డెన్న, సగ్గు రవి, యోగేష్, శివ, రాకేష్, గాండ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

భీమ్‌గల్, ఆగస్టు29: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది గురువారం భీమ్‌గల్ పట్టణంలో ముచ్కూర్ చౌరస్తా వద్ద వ్యాపా రులకు, ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వ్యాపార సముదాయాలు, నివాసగృహాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు సీవోలు, డీసీపీ పౌడర్ లాంటివి వాడకం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని, ఇలాంటి సమయంలో ఏసీలు, లిఫ్టులు వాడకూడదని తెలిపారు. అలాగే నివాసగృహాల్లో వాడే సిలిండర్ వల్ల ప్రమాదం సంభవించినప్పుడు చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది మధుసుదన్, శ్రీనివాస్, భూమేశ్వర్, గంగ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల మరమ్మతు పనులు ప్రారంభం

మోర్తాడ్, ఆగస్టు 29 : మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామం చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకానికి మరమ్మతు పనులకు రూ.44లక్షలు మంజూరు కాగా గురువారం కాంగ్రెస్ నాయకులు పనులను ప్రారంభించారు. తిమ్మాపూర్ గ్రామంలోని చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకంలో పైప్‌లైన్ లీకేజీ వల్ల నీటి సరఫరా సమస్య తలెత్తడంతో బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌కు తెలుపగా వెంటనే స్పందించారు. దీంతో మరమ్మతులకు కావాల్సిన నిధులను సునీల్‌కుమార్ మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువద్దాం

● టీడీపీ బోధన్ పట్టణ అధ్యక్షుడు

బోధన్‌రూరల్, ఆగస్టు 29: బోధన్‌లో తెలుగు దేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకువద్దామని పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.ఉదయ్ భాస్కర్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో పోరుకు సిద్ధంగా ఉండాలని, పార్టీ సంస్థగతంగా బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు పార్టీని వదిలి వెళ్లిన కార్యకర్తలు, పదవులను అనుభవించిన వారు తిరిగి పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తున్నానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల వద్దకే పాలన కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరించబడ్డాయని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ తరఫున పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు తదితరులున్నారు

ఆయుష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కోటగిరి,ఆగస్టు29: పోతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయుష్ ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, మోకాళ్ల నొప్పులు ఇతర జబ్బులకు చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇన్‌చార్జి నారాయణ రావు, వైద్యులు రాధిక, కరణ్, వెంకటేష్, శ్రావ్య, సిబ్బంది సుజాత, సావిత్రి, పురోషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతలక్ష్యాలను చేరుకోవాలి

● భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్

కమ్మర్‌పల్లి, ఆగస్టు 29: విద్యార్థులు దుర్వెసనాలకు దూరంగా ఉంటు శ్రద్ధబుద్దులతో, క్రమశిక్షణతో చదివి ఉన్నతలక్ష్యాలను చేరుకోవాలని భీమ్‌గల్ సీఐ నవీన్ కుమార్ అన్నారు. గురువారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని శ్రీభాషిత జూనియర్ కళాశాలలో ద్వితీయసంవత్సరం ఇంటర్‌మీడియట్ విద్యార్థులు మొదటిసంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వెల్‌కం పార్టీలో ముఖ్యఅతిదిగ హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇంటర్మీడియట్‌అనేది విద్యార్థిదశకు కీలకమని భవిష్యత్తులో ఉదోయగాలు సంపాదించుకునేందు కృషిచేస్తారని అన్నారు విద్యార్థులు సమయాన్ని వృదిచేయకుండా బాగాచదివి వార్షికపరీక్షలు, పోటీపరీక్షలుకు హజరవ్వాని ఆయన సూచించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఉన్నత లక్ష్యాన్ని చేరుకుని తల్లిదండ్రుల ఆశయాలకోసం పాటుపడాలని, మార్చ్‌లో జరిగే వార్షిక పరీక్షలోల విజయం సాదించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శన అకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ , కరస్పాండెంట్ రాజశేఖర్, డైరెక్టర్‌లు సుంకెట రవి, సిలివేరి సంజీవ్,మాలవత్ సంతోష్, అధ్యాపకులు శ్రీనివాస్, గజానంద్, శ్రీధర్, జంజీత్, రాజేష్, శృతి, చైతన్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటీ సాధించిన విద్యార్థులకు సన్మానం

ముప్కాల్, ఆగస్టు29: ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాసర ట్రిపుల్ ఐటికి ఎంపికైన ఎనిమిది మంది విద్యార్థులను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగారాం సన్మానించారు. ట్రిబుల్ ఐటి సాధించిన విద్యార్థులు ప్రశాంత్, కార్తికేయచారి, రచన్, వైశాలి, ఎస్.వైశాలి, రచనలను పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యా యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, రవికుమార్, ఉపాధ్యా యులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు

పెద్దబజార్, ఆగస్టు 29: పోషకాహారం, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నగరంలోని అర్సపల్లిలోగల పట్టణ ఆరోగ్య కేంద్రంలో నగరంలోని ఖలీల్‌వాడిలోగల నలందా డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోషకాహారం, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యంలో భా గంగా వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం, ఆధ్యాత్మిక ఆరోగ్యం ప్రధానమైనవని అన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల్లో ప్రధానంగా వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై దృష్టిసారించాలన్నారు. కీటక, జనిత వ్యాధులను నియంత్రణలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా ముఖ్యమైనవని అన్నారు. దోమల నియంత్రణకు ఇంటి పరిసరాలలో నీటినిల్వలను తొలగించాలని డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు, ప్లాస్టిక్, చెత్తా చెదారాన్ని తొలగించాలన్నారు.ఇండ్లలో వాడేటువంటి కూలర్లు, నీటితొట్టెలు, సంప్‌లు ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుభ్రపరిచి ఎండబెట్టి మరుసటి రోజు నీటిని పట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నతో పాటు అర్సపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం ఏఎన్‌ఎం స్వరూప, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన అన్వేష్‌రెడ్డి


మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

వేల్పూర్, ఆగస్టు29: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త జబిరి రమేష్ సోదరుడు జబిరి మహేష్ ఇటీవలే మరణించారు.. అలాగే అనారోగ్యంతో ఇటీవలే మరణించిన ఆది సురేష్ వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి పరామర్శించారు. వా రి మృతికి గల కారణాలను అడిగితెలుసుకొని కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పేదకుటుంబానికి జబిరి మహేష్ మరణించడంతో ఆయన భార్య, కూతురు రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అన్వేష్‌రెడ్డి అందజేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తక్కురి గంగాధర్, సొసైటీ డైరెక్టర్ గట్టవుతాల నర్సారెడ్డి, లింగేశ్వర్, రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ సభ్యుడు అంకన్నగారి రాజశేఖర్, నెహ్రూ, ఆది చిన్న ముత్తెన్న, నోముల గంగాధర్, తదితరులు ఉన్నారు.

పొతంగల్‌లో ఇసుక డంప్ సీజ్

కోటగిరి,ఆగస్టు29: పొతంగల్ మండల కేంద్రంలోని వీరభద్రుడి ఆలయం సమీపంలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక నిల్వలను తహసీల్దార్ మల్లయ్య గురువారం సీజ్ చేశారు. గ్రామానికి చెందిన కొందరు ఇసుక డంప్‌లపై ఫిర్యాదు చేయడంతో పరిశీలించి సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక డంప్ చేసినా, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

గూపన్‌పల్లి పాఠశాల తనిఖీ

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 29: నిజామాబాద్ రూరల్ మండలంలోని గంగాస్థాన్-2లోగల గూపన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం నిజామాబాద్ ఎంఈవో సేవ్‌లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాల మరమ్మతు పనుల తీరును, మధ్యాహ్న భోజనం నిర్వహణ, పాఠశాలలో కొనసాగుతున్న అభ్యాసన అభివృద్ధి కార్యక్రమ వివరాలను ఆయన పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శకుంతల, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

తల్ సైనిక్ క్యాంప్‌కు ఎంపికైన విద్యార్థిని

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 29: జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజెడ్‌సీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సాత్విక ఢిల్లీ తల్ సైనిక్ క్యాంప్‌కు ఎంపికైంది. వివిధ క్యాంపుల్లో ప్రతిభకనబర్చిన ఎన్‌సీసీ క్యాడెట్లను ఢిల్లీ తల్ సైనిక్ క్యాంప్‌కు ఎంపిక చేస్తారు. రిపబ్లిక్ డే పరేడ్ లాంటి జాతీయ స్థాయి అతిపెద్ద ఆర్మీ విభాగపు క్యాంప్ ఇది. ఈ సందర్భంగా విద్యార్థిని సాత్వికకు కళాశాల ప్రిన్సిపాల్ భారతిరెడ్డి, తదితరులు ఘనంగా సన్మానించారు. ఎన్‌సీసీ ఏఎన్‌వో సంధ్యతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు బోధనేతర సిబ్బంది సాత్వికకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కవిత విడుదలతో బీఆర్‌ఎస్ లీగల్ సెల్ సంబరాలు

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 29: భారత రాష్ట్ర సమితి శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టు, సీబీఐ, ఈడి కేసులలో బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలైన నేపథ్యంలో జిల్లా బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా భారత లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దాదన్నగారి మధుసూదన్‌రావు మాట్లాడుతూ కుట్రదారుల కుట్రలను ఛేధించి కుట్రదారులకు ఒక గుణపాఠం నేర్పిన తీర్పు వెలువడిందని అన్నారు. వ్యక్తుల స్వేచ్ఛను, హక్కులను పరిరక్షించే విధంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం చాలా ఆనందకరమని అన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేందర్‌రెడ్డి, ఎల్ఎన్‌శాస్త్రి, గిరిధర్‌రావు, కిరణ్‌కుమార్, వినాయక్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి


మోపాల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

మోపాల్, ఆగస్టు 29: మహిళలకు అండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని క్యాంప్ కార్యాలయంలో మోపాల్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 81 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆడపిల్లలకు పెళ్లి కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. 81 మందికి రూ.80లక్షల 90వేల చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. పేద ప్రజల కోసం సీఎం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. మనమందరం సీఎంకు అండగా నిలవాలని అన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, బాడ్సి, మోపాల్ చైర్మన్‌లు మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● ఇచ్చిన మాటకు కట్టుబడిన రేవంత్ సర్కార్

డిచ్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 9నెలల కాలంలోనే నేరవేరుస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మెంట్రాజ్‌పల్లి, ధర్మారం, నడిపల్లి, డిచ్‌పల్లి గ్రామాల కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న సీఎం కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర బడ్జెట్ లేకున్నా సంక్షేమ పథకాలు ఆగడం లేదని తెలిపారు. రైతు రుణ మాఫీ కూడా అర్హులైన వారికి అందజేయడం జరుగుతుందని రైతులు శ్రేయస్సుకు వ్యవసాయాధికారులతో మాఫీ కాని రైతులు వివరాలు సేకరిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమలాపూర్ శ్రీనివాస్, అమృతాపూర్ గంగాధర్, రాంచందర్ గౌడ్, ముల్లంగి నర్సయ్య, రఘు, సుదీర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్ శివారులో నడిపల్లి తండా యువకుడి దారుణహత్య

● ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ,సీఐ,ఎస్సైలు ● డాగ్ స్క్వాడ్ తో గాలించిన పోలీసులు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు


డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి,ఆగస్టు 29: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ స్వాగత తోరణం చికెన్ సెంటర్ వద్ద నడిపల్లి తండాకు చెందిన బట్టు కృష్ణ 28 బుధవారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. యువకుడి తల, వీపు భాగంలో కత్తిపోట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హత్య జరిగిన ప్రాంతానికి ఐదు గజాల దూరంలో కల్తీ కల్లు దుకాణం ఉండటంతో కల్లు బట్టి వద్ద గొడవ జరిగి కృష్ణను ఎవరైనా దాడిచేసి హత్య చేశారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బట్టు క్రిష్ణ భార్య గత 3ఏళ్లుగా భర్తతో గొడవ పడి ముగ్గురు కొడుకులను వదిలేసి వెళ్లిపోయిందని మృతుని సోదరుడు అశోక్ వాపోయాడు. అందరితో కలిసి మెలిసి ఉండే కృష్ణ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడని హత్య చేసిన నిందితులను పట్టుకొని చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు పేర్కొంటున్నారు.

● డ్వాగ్ స్క్వాడ్‌తో అణువణువ శోధన

ఘన్‌పూర్ స్వాగత తోరణం వద్ద నడిపల్లి తండాకు చెందిన క్రిష్ణను హత్య చేయడంతో పోలీసులు రంగంలో దిగి ప్రత్యేక డ్వాగ్ స్క్వాడ్‌తో పరిశీలన జరిపారు. హత్య ప్రాంతంతో పాటు చుట్టూ పక్కల గాలింపు చేపట్టారు. ఈవిషయం తెలుసుకొని ఏసీపీ రవి రాజారెడ్డి, సీఐ మల్లేశ్, ఎస్సై షరీఫ్‌లు కల్లు కాంట్రాక్టర్ నారాగౌడ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ పుటేజీలను పరిశీలించారు. డిచ్‌పల్లి రహదారి పక్కనే చికెన్ సెంటర్ మొ ద్దుపై కృష్ణను హత్య చేయడంతో స్థానికులు భయందోనలకు లోనవుతున్నారు. ఇప్పటి వరకు ఇదే ప్రాంతంలో గుర్తు తెలియని హత్యలు జరిగేందుకు మద్యం ప్రియులు మత్తులో దాడులకు తెగబడుతున్నారని స్థానికులు తెలిపారు. ఈ ప్రాంతంలో సాయం త్రం అయితే చాలు కల్లు కోసం వచ్చే బాధితులతో పాటు యాచకులు రోడ్లపై చిందులు వేస్తు స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తు న్నారు. మద్యం మత్తులోనే ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు తరు చుగా జరుగుతున్నాయని పేర్కొంటున్నారు.ఈ మేర కు శవాన్ని పంచనామా చేసి ఎస్సై షరీఫ్ మృతదేహం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిం చారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


మృతుడి కృష్ణ (ఫైల్)

ఐదు ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ కాయిల్స్ చోరీ

నవీపేట,ఆగస్టు29: మండలంలోని నాళేశ్వర్ నాలుగు, నందిగామ శివారులో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్‌ను చోరీ చేశారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్ కుమార్, స్థానిక రైతులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు నాళేశ్వర్ శివారులో ఉన్న నాలుగు ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి అందులో కాపర్ కాయిల్స్ చోరీ చేయగా, నందిగామ శివారులో ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్ ఎత్తుకెళ్లారు. గుర్తు తెలియని దొంగలు కారులో వచ్చి సంబంధిత వస్తువులను ఎత్తుకెళ్లినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన వారిలో ఎస్ఐ వినయ్, ఏఎస్ఐ గఫర్, ట్రాన్స్‌కో సిబ్బంది ఉన్నారు.

● పెరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్ చోరీ కేసులు

మండలంలోని వివిధ గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్‌ల ఆయిల్ చోరీ కేసులు ఇటీవల పెరిగిపోయ్యాయని రైతులు పేర్కొన్నారు. గత నెల రోజుల వ్యవధిలో మండలంలోని వివిధ గ్రామాలలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, 63కేవీకి చెందిన నాలుగు ట్రాన్స్‌ఫార్మర్‌లు, 40కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, బుధవారం రాత్రి జరిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీ కేసులను కలుపుకుని 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఆరు ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తు తెలియని ధ్వంసం చేసి అందులో ఉన్న ఆయిల్‌తో పాటు కాపర్ కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం వరిపంట పొట్టదశలో ఉన్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగలను వెంటనే పట్టుకుని వారిని కఠినంగా శిక్షించాలని రైతులు కోరారు.


నాళేశ్వర్‌లో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

చెరువులో పడి ఒకరి ఆత్మహత్య

కోటగిరి,ఆగస్టు29: కోటగిరి మండల కేంద్రానికి చెందిన షేక్.తన్ను(43)అనే వ్యక్తి చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. తన్ను మద్యానికి బానిసై రోడ్లపై తిరిగేవాడు. అనారోగ్యానికి గురైన తన్ను జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని దామెర చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహన్ని వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు తనయుడు అర్బస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


షేక్ తన్ను మృతదేహం

గుర్తు తెలియని శవం లభ్యం

ఎడపల్లి, ఆగస్టు29: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో గురువారం గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణా రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని రోడ్డు ప్రక్కన గుర్తు తెలియని శవం ఉన్నట్లు సమాచారం అందగా సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా సుమారు 70 సంవత్సరాల వయసుగల వృద్ధుడు చనిపోయి ఉన్నాడని, అతని ఆచూకీ తెలియలేదని ఆయన తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

నవీపేట ఎస్సీ బాలుర హాస్టల్ భవన పరిశీలన

నవీపేట,ఆగస్టు29: నవీపేటలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను గురువారం బోధన్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి సోమశేఖర్ పరిశీలించారు.ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన శిథిలావస్థలో హాస్టల్ భవనం అనే వార్తకు అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆయన శిథిలావస్థ దశలో ఉన్న హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ నవీపేట ఎస్సీ బాలుర హాస్టల్ భవనం శిథిలావస్థ దశకు చేరినందున నూతన భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుత భవనానికి మరమ్మతులు చేపడతామని ఆయన పేర్కొన్నారు.హాస్టల్‌లో వసతి పొందుతున్న విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను త్వరలోనే అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హాస్టల్ వార్డెన్ నర్సింలు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● జిల్లా సీనియర్ న్యాయాధికారి పద్మావతి


కొత్తపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా సివిల్ న్యాయాధికారి

కోటగిరి, ఆగస్టు29: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి సూచించారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం సీనియర్ సివిల్ న్యాయాధికారి పద్మావతి సందర్శించారు. పాఠశాలలో ఇటీవల విద్యార్థులకు కారం పొడితో అన్నం పెట్టిన సంఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు మరోసారి పురావృతం కారాదని సూచించారు. బిల్లులు సరిపడ రావడం లేదని ఏజెన్సీ కార్మికులు జిల్లా న్యాయాధికారి దృష్టికి తీసుకురాగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లోని గుమ్మడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనాథ బాలుర ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం మేనేజర్ మధు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మేకలను అపహరించిన దుండగులు

ఖిల్లా, ఆగస్టు 29: నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మేకలను అపహరించిన దుండగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మేకలను అపహరించడానికి వాడిన కారును సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. నగరంలోని మిర్చికంపౌండ్ ప్రాంతంలో బుధవారం రాత్రి నలుగురు దుండగులు కారులో వచ్చి అక్కడే ఉన్న కొట్టలోంచి 18 మేకలను అపహరించుకొని పారిపోయారు. ఉదయం యజమాని చూడగా తన కొట్టంలో మేకలు కనిపించకపోవడంతో వెంటనే ఒకటవ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా మేకలను అపహరించిన దుండగుల కోసం విచారణ చేపట్టారు. సీసీకెమెరాలలో కారును గుర్తించిన పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కారును ఎవరికి అద్దెకు ఇచ్చారో మేకలను ఎవరు అపహరించారో అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మున్సిపల్ కార్మికులపై దాడులను నిరసిస్తూ ధర్నా


ధర్నా చేస్తున్న కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

బోధన్‌రూరల్,ఆగస్టు29: మున్సిపల్ కార్మికులపై బోధన్‌లో గురువారం జరిగిన దాడులను నిరసిస్తూ మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులపై అకారణంగా దాడి చేయడం సరికాదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రక్షణ కల్పించాలన్నారు. శానిటేషన్ విభాగంలో పని చేసే కార్మికులు గురువారం ఉదయం విధుల్లోకి వెళ్లి పని చేసే సమయంలో కొంతమంది తమ ఇంటి ముందు ఉన్న డ్రైనేజీ తీయాలని భయపెట్టిస్తూ దాడులు చేశారన్నారు. ఈ ఘటనలో మున్సిపల్ కార్మికుల చేతి రెండు వేళ్లకు గాయాలయ్యాయన్నారు. చికిత్స నిమిత్తం వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐటీయూ నాయకులతో కలిసి మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించగా మున్సిపల్ కమిషనర్ కార్మికులతో మాట్లాడుతూ ఎంతటి వారైనా కఠినంగా శిక్షలు పడేలా చేస్తామని, కార్మికుల పక్షాన తాను సైతం ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు మల్లేష్, శంకర్ గౌడ్, మున్సిపల్ జవాన్‌లు గోపి, గాబ్రియల్, గంగారాం, రాజు, గంగామణి, సాయమ్మ, కార్మికులుపాల్గొన్నారు.